జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైమ్ హై

ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, మే 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే 12.6 శాతం అధికమని పేర్కొంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 1, 2017 తర్వాత ఇదే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గడిచిన నెలలో వసూలైనదాంట్లో దేశీయంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 10.7 శాతం మేర పెరిగాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.48,634 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.59,372 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.69,504 కోట్లు, సెస్ రూపంలో రూ.12,293 కోట్లు వసూలయ్యాయి. దేశ ఆర్థిక రంగం బలంగా ఉందన్నడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శనమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే పన్ను వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయి దాటిందని డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి తెలిపారు. అత్యధిక ఉత్పత్తి, వినిమయ రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11 శాతం నుంచి 16 శాతం మధ్యలో నమోదవడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.

ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

ఏప్రిల్ 2025	రూ.2.37 లక్షల కోట్లు
ఏప్రిల్ 2024	రూ.2.10 లక్షల కోట్లు
మార్చి 2025	రూ.1.96 లక్షల కోట్లు

వాహన విక్రయాలు అంతంతే

న్యూఢిల్లీ, మే 1: మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గడిచిన నెలలో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలు మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు పెరగగా..టాటా మోటర్స్, హ్యుందాయ్ సేల్స్ తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మహీంద్రా రెండో స్థానానికి, టాటా మోటర్స్ మూడో స్థానానికి ఎగబాకింది. కానీ, రెండో స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ ఈసారి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. మారుతి అమ్మకాలు ఏడు శాతం అధికమయ్యాయి.

ఏప్రిల్ నెలలో వాహన అమ్మకాలు

సంస్థ	2025	2024	వృద్ధి(శాతంలో)
మారుతి	1,79,791	1,68,089	7
మహీంద్రా	84,170	====	19
టాటా మోటర్స్	72,753	77,521	-6.1
హ్యుందాయ్	60,774	63,701	-5
టయోటా కిర్లోస్కర్	27,324	20,494	33
ఎంజీ మోటర్స్	5,829	4,725	23
కియా ఇండియా	23,623	19,968	18
హోండా కార్స్	3,360	4,351	-23
ద్విచక్ర వాహనాలు			
టీవీఎస్ మోటర్	4,43,896	3,83,615	16
సుజుకీ మోటర్‌సైకిల్	1,12,948	99,377	14
రాయల్ ఎన్‌ఫీల్డ్	86,559	82,043	6

హైదరాబాద్ ఆఫీస్ ఖాళీ

వృథాగా 284 లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు

దేశంలోనే అత్యధికం.. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్

అద్దెకు పెద్దగా ఆసక్తి చూపని కార్పొరేట్లు: వెస్టియన్

ఈ నగరానికి ఏమైంది. అవును.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను చూస్తే ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయిప్పుడు.

ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన ఆఫీస్ స్పేస్.. ఇప్పుడు ఆదరణ లేక కళావిహీనంగా కనిపిస్తున్నది. అద్దెకు తీసుకునేవారే కరువైపోయారు మరి.

గతంలో ఇక్కడ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొనేందుకు క్యూ కట్టిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు ఖాళీగా ఉన్నాయంటూ రియల్ ఎస్టేట్ రిపోర్టులు వస్తున్నాయి.



బీఆర్ఎస్ హయాంలోనే బాగుబాగు

ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడకన సాగిన అభివృద్ధి.. విభజన అనంతరం తెలంగాణలో పరుగులు పెట్టింది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు అన్ని రంగాలను బలపర్చాయి. ఐటీ, ఫార్మా, ఆటో, ఏవియేషన్, డిఫెన్స్ ఇలా కీలక రంగాలు వృద్ధిపథంలో పయనించాయి. ఇది ఇక్కడి నిర్మాణ రంగానికి ఊహించని స్థాయిలో డిమాండ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ఆఫీస్ స్పేస్‌కు గిరాకీని అమాంతం పెంచేసింది. దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు భారీగా ముందుకొచ్చాయి. భారత్‌లోకి రావాలంటే హైదరాబాద్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకోవాలన్నంతగా డిమాండ్ నెలకొన్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి అనేక సంస్థలు హైదరాబాద్‌లో బడాబడా ఆఫీసులను తీసుకొచ్చాయి. మరెన్నో స్టార్టప్‌లూ కొలువుదీరాయి. ఫలితంగా ఆఫీస్ మార్కెట్ వేగంగా విస్తరించింది. దాదాపు పదేండ్ల టీఆర్ఎస్, బీఆర్ఎస్ పాలనలో ఇలాగే సాగిందంతా. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అంతా తలకిందులైంది. ఏడాదిన్నరగా పెట్టుబడులు రాక మార్కెట్‌లో స్తబ్ధత నెలకొన్నది. అందుకు ఆఫీస్ స్పేస్ మార్కెట్ అద్దం పడుతున్నది.

284 లక్షల చదరపు అడుగుల్లో..

దేశంలోని 7 ప్రధాన నగరాల ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై వెస్టియన్ సర్వే చేసింది. దీని వివరాల ప్రకారం హైదరాబాద్‌లోనే గరిష్ఠంగా కార్యాలయ స్థలాలు వృథాగా పడిపోయి ఉన్నట్టు తేలింది. ఏకంగా 284 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీగా ఉన్నదని వెస్టియన్ ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నాటికి హైదరాబాద్‌లో మొత్తం అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్ 1,620 లక్షల చదరపు అడుగులు. ఇందులో 284 లక్షల చదరపు అడుగులు ఖాళీగానే ఉన్నది. ఇది మొత్తం స్టాక్‌లో 17.5 శాతానికి సమానం. కార్పొరేట్ కంపెనీలు అద్దెకు తీసుకొనేందుకు పెద్దగా ఆసక్తి చూపట్లేదని వెస్టియన్ పేర్కొన్నది. కాగా, గతంలోనూ ఆయా నగరాల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీలుండేవి. అయితే హైదరాబాద్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించేది. దాంతో ఆఫీస్ స్పేస్ గిరాకీలో నగరం ఎప్పుడూ టాప్‌లో ఉండేది. మిగతా నగరాలతో పోల్చితే లీజింగ్ పెద్ద ఎత్తున జరిగేది మరి. కానీ మారిన పరిస్థితులతో ఇప్పుడు ఖాళీల్లో టాప్‌లో ఉంటున్నది.

- *దేశంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఆఫీస్ స్పేస్ ఖాళీలు. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నాయి.*
- *బెంగళూరు (2,805 లక్షల చదరపు అడుగులు) తర్వాత ఎక్కువగా ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉన్నది హైదరాబాద్ (1,620 లక్షల చదరపు అడుగులు)లోనే.*
- *బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో జోరుగా డిమాండ్-సప్లై. ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో సప్లై కూడా ఆగిపోయింది.*
- *ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్ 34 శాతం పెరిగి 179.6 లక్షల చదరపు అడుగులకు చేరిక.*
- *జీసీసీలు, ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల నుంచి కనిపించిన డిమాండ్.*

ఆగిన కొత్త నిర్మాణాలు

ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యి అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంత మాత్రంగానే ఉండటంతో కొత్త నిర్మాణాలు దాదాపుగా ఆగిపోయాయి. రియల్టర్లు, ఆఫీస్ స్పేస్ నిర్మాణ కంపెనీలు నూతన ప్రాజెక్టులకు దూరంగా ఉంటున్నాయి. ఫలితంగా సిమెంట్, ఉక్కు, ఇతర నిర్మాణ అనుబంధ రంగాలు కుదేలయ్యాయి. వాటిమీద ఆధారపడుతున్న పరిశ్రమలు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీల భవిష్యత్తు ఆందోళనలో పడింది. నిజానికి హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలు మునుపు ఇంకా ఎక్కువ (19 శాతం)గానే ఉండేవి. కానీ కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఇవి కాస్త తగ్గాయి. కాగా, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, పుణె నగరాలపై వెస్టియన్ సర్వే చేసింది.

దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఖాళీ ఆఫీస్ స్పేస్ నిల్వలు

నగరం	లక్షల చ.అడుగుల్లో
హైదరాబాద్	284
ఢిల్లీ-ఎన్‌సీఆర్	232
బెంగళూరు	210
ముంబై	125
కోల్‌కతా	79
చెన్నై	60
పుణె	56

కాగ్నిజెంట్‌లో 20 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మే 1: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్..ప్రస్తుతేడాది 20 వేల మంది ప్రెషర్లను నియమించుకోనున్నట్టు ప్రకటించింది. కృత్రిమ మేధస్సుతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై మంచి పట్టున్న ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నది. నూతన టెక్నాలజీ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు, గతేడాది రిక్రూట్ చేసుకున్నవారి కంటే రెండింతలు అధికంగా ఈసారి నియమించుకోనున్నట్టు కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ఎస్ తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 3,36,300 మంది ఉద్యోగులు ఉన్నారు.

దిగొస్తున్న బంగారం ధర

హైదరాబాద్‌లో తులం రూ.2,180 డౌన్ • 24 క్యారెట్ రూ.95,730

హైదరాబాద్, మే 1: నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలు.. ఇప్పుడు అంతే వేగంగా దిగొస్తున్నాయి. గురువారం ఒక్కరోజే హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.2,180 తగ్గి రూ.95,730 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.2,000 పడిపోయి రూ.87,750 వద్ద నిలిచింది. నిజానికి గత వారం రోజులుగా గోల్డ్ రేట్లు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతకుముందు తులం రేటు తొలిసారి లక్ష రూపాయల మార్కును దాటిపోయిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు, వివిధ కారణాలతో పతనమైన స్టాక్ మార్కెట్ల వల్ల దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధరలు వరుసగా పెరుగుతూపోయాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న బలహీన సంకేతాల నడుమ ధరలు దిగువ ముఖం పడుతున్నాయి.

లోహియా బిస్కెట్ ప్లాంట్

హైదరాబాద్, మే 1: హైదరాబాద్‌కు సమీపంలో మేడ్చల్ వద్ద వరల్డ్ క్లాస్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించింది లోహియా గ్రూపు. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం నెలకు 1000 టన్నుల బిస్కెట్లు తయారుకానుండగా, వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నాలుగేండ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది.

హైదరాబాద్‌లో ఆల్ట్.ఎఫ్ కో-వర్కింగ్ ఆఫీస్

హైదరాబాద్, మే 1: కో-వర్కింగ్ నిర్వహణ సంస్థ ఆల్ట్.ఎఫ్..హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 56 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 1,200 మందికి పైగా కూర్చోవడానికి వీలుంటుందని పేర్కొంది. సౌకర్యవంతమైన కార్యాలయాల మార్కెట్ భారీ వృద్ధిని నమోదు చేసుకుంటున్న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని కంపెనీ కో-ఫౌండర్ యోగేశ్ అరోరా తెలిపారు. ఒక్కో డెస్క్ నెలకు రూ.8 వేల చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ..ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లలో కో-వర్కింగ్ కార్యాలయాలను నిర్వహిస్తున్నది.

దళారుల చేతుల్లో మామిడి రైతుల దగా

- సమయానికి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆందోళనకు దిగిన అన్నదాతలు

మార్కెట్‌లో ఓపెన్ యాక్షనలో పాల్గొన్న కమీషన్ ఏజెంట్లు

జగిత్యాల టౌన్, మే 1: జగిత్యాలలోని చల్‌గల్ మామిడి మార్కెట్‌లో దళారుల చేతుల్లో దగాకు గురవుతున్నామని రాయికల్, మల్యాల మండలాల రైతులు బిక్షు, ఇలియాస్ బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఓపెన్ యాక్షన్‌లో నాణ్యతకు తగ్గట్టుగా ధర ఇవ్వకపోవడంతో పాటు మామిడికి నాణ్యత, గ్రేడ్ అంటూ సాకులు చెబుతూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి కాయల కొనుగోలుపై కేవలం 4 శాతం కమీషన్ చెల్లించాల్సి ఉండగా 10 శాతం తీసుకుంటున్నారని ఆరోపించారు. మామిడి కాయలు అమ్మిన తర్వాత కమీషన్ ఏజెంట్ నుంచి కమీషన్ చార్ట్ పట్టీ ఇవ్వాల్సి ఉండగా, తెల్ల చీటిపై రాసి ఇస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల్లోగా డబ్బులు చెల్లించాల్సి ఉండగా, వారం గడుస్తున్నా చెల్లించడం లేదని వాపోయారు. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా, రైతులు మోసపోయినట్లు తమ దృష్టికి తీసుకువస్తే వారికి తగిన న్యాయం చేస్తామని చెప్పారు. ఓ రైతు తమ దృష్టికి తీసుకువస్తే అతడికి రావాల్సిన డబ్బులు ఇప్పించినట్లు తెలిపారు. ఆ రైతుకు ఓపెన్ యాక్షన్‌లో పెట్టిన రేటు ప్రకారం డబ్బులు కమీషన్ ఏజెంట్ నుంచి ఇప్పించినట్లు తెలిపారు. మార్కెటింగ్ శాఖ తరపున తనతో పాటు ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు సెక్యూరిటీ గార్డులు ఓపెన్ యాక్షన్‌లో అందుబాటులో ఉంటారు. కమీషన్, తరుగు, ధర విషయాల్లో ఏమైనా తేడాలు ఉంటే నేరుగా తమను సంప్రదించాలని తెలిపారు.

వ్యవసాయ కళాశాలను తరలించవద్దు

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి

- జగిత్యాల జిల్లాలోనే కొనసాగించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి

జగిత్యాల రూరల్, మే 1: జిల్లాలోని మహిళా వ్యవసాయ కళాశాలను ఇక్కడే కొనసాగించాలని, వేరే జిల్లాకు తరలిస్తే ఉద్యమిస్తామని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలో గురువారం విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా వ్యవసాయ కళాశాలను జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేసిందన్నారు. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి వద్ద శాశ్వత భవన నిర్మాణానికి 70 ఎకరాల స్థలాన్ని సైతం గుర్తించినట్లు తెలిపారు. భవనం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా కోరుట్ల లోని ప్రభుత్వ భవనంలో తరగతులు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడి వ్యవసాయ కళాశాలను సిద్దిపేట జిల్లాలోని బెజ్జంకికి తరలించేందుకు సిద్ధమైందని, దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అక్రమ్ మాలిక్, జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వంశీ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాకేశ్, మైనార్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు షోహాల్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ముసిపట్ల లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్వీ నాయకులు వెంకటేశ్, రాజు, నరేశ్, ప్రతాప్, మధు, రాకేశ్, మనోహర్, గంగాధర్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, మే 1: విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో నరేశం పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, గడి ప్రాథమిక పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 రోజుల పాటు కొనసాగే వేసవి శిక్షణ శిబిరంలో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు చదువుతో పాటు డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కరాటే, కుట్టు, డ్యాన్స్, వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో నివాసం ఉంటున్న విద్యార్థులు శిక్షణకు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మార్గం రాజేంద్రప్రసాద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, నల్ల భూమయ్య, సీఆర్పీలు దేవేందర్, గంగాధర్, సత్యనారాయణ, మన్విత, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

మల్లాపూర్: కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్/మెట్‌పల్లి రూరల్, మే 1: ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే, మెట్‌పల్లి మండలం వేంపేట, కొండ్రికర్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రఘువరన్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీర్‌సింగ్, సీఈవో రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

భూ భారతి చట్టంపై పోలీసు అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో మధుసూదన్, పక్కన ఎస్పీ అశోక్‌కుమార్

- ఎస్పీ అశోక్‌కుమార్
- పోలీస్ అధికారులతో సమీక్ష

జగిత్యాల కలెక్టరేట్, మే 1: నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, వాటి పురోగతిపై స్టేషన్ల వారీగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిబద్ధతతో పని చేయాలన్నారు. చట్టాలకు లోబడి విధులు నిర్వహించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని, రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. నేరం జరిగిన సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలు, క్లూస్ సేకరణ, వంటి విషయాలపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. శ్రీనివాస్ అవగాహన కల్పించారు. గత నెలల్లో మూడు కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు, మరో కేసులో పదేళ్ల జైలు శిక్ష పడేలా కృషి చేసిన పీపీ మల్లికార్జున్, అడిషనల్ పీపీ మల్లేశంను ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే, కొండగట్టులో జరిగిన హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రఘుచందర్, రాములు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరీఫ్ అలీఖాన్, రఫీక్ ఖాన్, శ్రీనివాస్, ఆర్ఐలు కిరణ్‌కుమార్, వేణు, సీఐలు వేణుగోపాల్, రాంనర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, సురేశ్, ఎస్ఐలు, డీసీఆర్‌బీ, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన

జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో భూ భారతి చట్టంపై ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూభారతి చట్టం గురించి ఆర్డీవో మధుసూదన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పట్ల పోలీస్ శాఖ వ్యవహరించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.

అడిషనల్ ఎస్పీకి ప్రశంసా పత్రం అందజేత

జిల్లాలో ఇటీవల జరిగిన గ్రూప్-1, 3 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినందుకు గానూ టీజీపీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి జగిత్యాల అడిషనల్ ఎస్పీ భీంరావుకు ప్రశంసా పత్రాన్ని ప్రకటించారు. చైర్మన్ ప్రకటించిన ప్రశంసా పత్రాన్ని ఎస్పీ అశోక్ కుమార్ తన చాంబర్‌లో అడిషనల్ ఎస్పీ భీంరావుకు అందజేసి, అభినందించారు.

కూతుళ్లకు సమ ప్రాధాన్యమివ్వాలి

మహిళా సాధికారికతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మణెమ్మ

కోరుట్ల, మే 1: తల్లిదండ్రులు తమ కూతుళ్లపై వివక్ష చూపకుండా కుటుంబంలో సమ ప్రాధాన్యం కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ అర్బన్ సెక్టార్‌లో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ, లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. బాలికలను బాలురతో సమానంగా పోషించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల ఆరోగ్యం, చదువుపై శ్రద్ధ వహించి, క్రమశిక్షణతో ఎదిగేలా చూడాలన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ శక్తి, మహిళా సాధికారత, సఖీ కేంద్రం 181, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సైబర్ క్రైమ్ 1930, వయోవృద్ధుల హెల్ప్ లైన్ 14567, వివిధ రకాల సేవల ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు గౌతమి, స్వప్న, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ అనురాధ, మానస, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన



సారంగాపూర్: బట్టపల్లిలో విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

సారంగాపూర్/మేడిపల్లి, మే 1: సారంగాపూర్ మండలం బట్టపల్లిలో 'పది' ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాలతో సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి, నాయకులు ప్రేమానందం, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే, భీమారం మండలం వెంకట్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లావణ్య, మాజీ సర్పంచ్ అరుణ,